పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఆర్య అనే చిన్నారి రచించిన బ్రేవరీ ఆఫ్ హనుమాన్ అనే బాలల సాహిత్యం అనే కథల పుస్తకాన్ని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. అతి చిన్న వయస్సులో రచనలకు ప్రేరణగా నిలిచినందుకు ఆయన ఆర్యను అభినందించారు. భవిష్యత్‌లో ఆర్య గొప్ప రచయితగా మారాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

డీ అడిక్షన్ సెంటర్ల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం



బి.శైలజ

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డీ అడిక్షన్ సెంటర్ల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలని వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ డైరెక్టర్ బి.శైలజ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్ బాధితులకు పునరావాసం కల్పించేందుకు జిల్లా కేంద్రాలలో డీ అడిక్షన్ ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని సూర్యాపేట, నాగర్ కర్నూల్, సిరిసిల్ల, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. వివరాలకు నల్గొండ క్రాస్‌రోడ్డులోని వికలాంగుల సంక్షేమ భవనంలోని కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

వరద నీటి పైప్‌లైన్ పనులు ఆపాలి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: ఎల్‌బీనగర్ నుంచి మూసీ వరకు వరద నీటి పైప్‌లైన్ పనులను పరిసర కాలనీ వాసులకు సమాచారం ఇవ్వకుండా ఎలా ప్రారంభిస్తారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కాలనీ వద్ద కొనసాగుతున్న వరదనీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. మూసీకి సరైన ఔట్‌లెట్ లేదని వెంటనే పైప్‌లైన్ పనులను ఆపాలన్నారు. పై కాలనీల నుంచి వచ్చే వరద నీటితో వర్షాకాలంలో న్యూ నాగోల్ కాలనీ, సమతపురి కాలనీ, భరత్‌నగర్ వరదతో మునిగిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. పైప్‌లైన్ ఔట్‌లెట్ పూర్తిగా పరిశీలించిన తర్వాతే పనులు ప్రారంభించాలని సూచించారు.

వివాహిత అదృశ్యం



కేతావత్ శ్రీలత

చైతన్యపురి: కళాశాలకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..చైతన్యపురిలో నివసించే కేతావత్ స్వామి భార్య శ్రీలత(21) నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతుంది. సోమవారం కళాశాలకు వెళ్లేందుకు శ్రీలతను చైతన్యపురి మెట్రో స్టేషన్ వరకు బైక్‌పై దించి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో స్వామి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



హస్తినాపురం: స్పృహతప్పి పడిపోయిన గుర్తు తెలియని వృద్ధుడిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం రైతుబజార్ వద్ద దాదాపు 60 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు స్పృహతప్పి పడిపోవడాన్ని గమనించిన స్థానికులు పోలీసుల సహకారంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

వీడిన నిర్లక్ష్యం..
సమస్య పరిష్కారం

మన్సూరాబాద్ పెద్ద చెరువులో మురుగునీరు చేరి దుర్గంధంగా మారుతోంది. సరస్వతినగర్‌కాలనీలోని వరద నీటి కాలువలోకి డ్రైనేజీ మురుగు వదులుతుండటంతో నేరుగా చెరువులోకి చేరేది. ఈ సమస్యలపై పలుమార్లు స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోయేది. ఈ సమస్యపై బుధవారం 'నిండా నిర్లక్ష్యం.. చెరువు కలుషితం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి డ్రైనేజీ మురుగు పైపులైన్‌ను వేరు చేసి ప్రత్యేక లైన్ వేసేందుకు చర్యలు చేపట్టారు.దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి పెద్దచెరువు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. – మన్సూరాబాద్



సరస్వతీనగర్‌కాలనీలో నూతన డ్రైనేజీ పైపులైన్ కోసం చేపడుతున్న పనులు



నిండా నిర్లక్ష్యం.. చెరువు కలుషితం

సాక్షిలో ప్రచురితమైన కథనం

గతంలో నిర్మించి టాయిలెట్



ప్రస్తుతం ఇలా..



ఏదీ స్వచ్ఛత..
మరిచారు బాధ్యత

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో రెండేళ్ల కిత్రం స్వచ్ఛ టాయిలెట్ల పేరుతో సుమారుగా రూ.5 కోట్లు ఖర్చుచేసి 500 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఆ తర్వాత వీటి నిర్వహణను విస్మరించడంతో అధ్వానంగా మారి కంపు కొడుతున్నాయి. రూ. కోట్లలో ఖర్చుచేసి ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో అటుగా వెళ్లే క్రమంలో దుర్వాసన వస్తోందని అధికారులపై పాదచారులు మండిపడుతున్నారు. నీటి సౌకర్యం లేదు. తలుపు కూడా ఊడిపోవడంతో మలమూత్ర విసర్జనకు ఇబ్బందికరంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావాలని బాటసారులు, స్థానికులు కోరుతున్నారు. – ఎల్‌బీనగర్

రోడ్ల పక్కన చెత్తవేస్తే జరిమానా విధిస్తాం



శానిటరీ అధికారులకు సూచనలు ఇస్తున్న డీసీ జయంత్

చాదర్‌ఘాట్: హోటళ్లు, పాన్ డబ్బాలు, మెస్‌లు, టీ కొట్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా రోడ్ల పక్కన చెత్తవేస్తే జరిమానాలు విధిస్తామని సర్కిల్–6 డీసీ జయంత్ హెచ్చరించారు. బుధవారం వ్యాపారులకు చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. వ్యాపారాలు ముగిసిన తర్వాత రాత్రి సమయాల్లో చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారని అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. మొదట అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇస్తామని వినకపోతే నోటీసులు జారీ చేసి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రతి వ్యాపారి షాపు ఎదుట బిన్లు ఏర్పాటు చేసుకోవాలని నిండిన తర్వాత స్వచ్ఛ ఆటోకు అందించాలన్నారు. వ్యాపార సముదాయాలు, సూపర్ మార్కెట్లు, టీ బండ్లు, దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని మలక్‌పేట సర్కిల్–6 ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఒంటెద్దు పోకడలు మానుకోవాలి

మలక్‌పేట: కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి షేక్ అక్బర్ ఒంటెద్దు పోకడలు మానుకోవాలని ఆ పార్టీ డివిజన్ల అధ్యక్షులు హితవు పలికారు. సీనియర్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులకు సమాచారం ఇవ్వకుండా చంచల్‌గూడలో సమావేశం నిర్వహించడాన్ని ఖండిస్తూ డివిజన్ల అధ్యక్షులు మూసారంబాగ్ లింగాల శ్రీనివాస్‌గౌడ్, చవుని షాహేద్‌ఖాన్, ఆజంపుర రాహుల్‌సింగ్, ఓల్డ్‌మలక్‌పేట షకీల్, సైదాబాద్ చక్రపాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్‌సింగ్, సాయిరామ్‌ల బృందం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీలో గ్రూప్‌లకు తెరలేపడంతో విబేధాలు తారస్థాయికి చేరుకున్నాయన్నారు.అక్బర్ తన సొంత నిర్ణయాలతో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నాడని సీనియర్లకు సమాచారం ఇవ్వకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం పద్ధతి కాదని మలక్‌పేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇతరులకు అప్పగించాలని టీపీసీసీకి విజ్ఞప్తి చేశారు.

కాలనీల అభివృద్ధికి కృషి



ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పాటైన గౌతంనగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం కార్పొరేటర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయించి సమస్యలు లేని కాలనీలుగా మారుస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో సుధాకర్‌గౌడ్, కిషన్, సాయిబాబా, రాజు, నారాయణరావు, గోపిచంద్, హరిరెడ్డి, సుకుమార్, కరుణాకర్ ఉన్నారు.

తలసీమియా బాధితులకు ఉచిత వైద్య సేవలు

మన్సూరాబాద్: తలసీమియా బాధితులకు ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎస్. నర్సింహారావు, డాక్టర్ కంచన్ చన్నావర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తలసీమియా వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స చేయవచ్చన్నారు.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న నర్సింహగుప్తా

చైతన్యపరి: చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా బుధవారం శానిటేషన్, హార్టికల్చర్ సిబ్బందితో కలిసి ప్రభాత్‌నగర్‌లో పర్యటించారు. కాలనీలోని పార్కును సందర్శించి అక్కడ పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తరలింపజేశారు. కాలనీలో మట్టికుప్పలు, ఎండిపోయిన చెట్ల కొమ్మలను రెండ్రోజుల్లో తరలించే ఏర్పాటు చేయాలని డిప్యూటీ కమిషనర్ సుజాతను ఫోన్‌లో కోరారు. శానిటేషన్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించి కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. కార్పొరేటర్ వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, జవాన్ రమేష్ హార్టికల్చర్ సత్యనారాయణ, కాలనీవాసులు రాజగోపాల్, నర్సింహరావు, రఘురాం, రామారావు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. కృష్ణానగర్ కాలనీలో రూ.15.40లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులను బుధవారం ఆమె కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్‌లోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డివిజన్‌లో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీ సభ్యులు జైపాల్‌రెడ్డి, శ్రీను, సునీల్, ప్రవీణ్, సత్యం పాల్గొన్నారు.

బోనాల అభివృద్ధి పనులు చేపట్టాలి



పూలతోటలో పాడైన రోడ్డును పరిశీలిస్తున్న ఏఈ నరేష్, సహదేవ్

చంచల్‌గూడ: రానున్న బోనాల జాతర పురస్కరించుకుని కుర్మగూడ డివిజన్‌లోని ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో జీహెచ్‌ఎంసీ ఏఈ నరేష్‌తో కలిసి పర్యటించారు. అమ్మవారి ఊరేగింపులు, బోనాల ఊరేగింపులు వెళ్లే దారుల్లో రోడ్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బండ వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య

నాగోలు: అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు సాయినగర్ కాలనీలో నివాసముండే తాటి జంగయ్య(52) సాయినగర్ కాలనీ అపార్ట్‌మెంట్‌లో గది అద్దెకు తీసుకుని మల్లికార్జున మల్టీ లెవెల్ మార్కెటింగ్ కార్యాలయాన్ని ప్రారంభించాడు. గత కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. అతడికి రావాల్సిన డబ్బులు రాకపోవడం, జంగయ్య ఇతరులకు ఇవ్వాల్సిన డబ్బుల కోసం గత కొంత కాలంగా ఒత్తిడి పెరగడంతో సతమతమవుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు తట్టుకోలేక బుధవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ పై అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన జంగయ్యను చికిత్స నిమిత్తం కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టీకాల శిబిరానికి స్పందన

మన్సూరాబాద్: రాక్‌టౌన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆసుపత్రి వైద్యులు రాక్‌టౌన్‌కాలనీ సంక్షేమ సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన చంటి పిల్లల వ్యాక్సినేషన్‌కు స్పందన వచ్చింది. సమీప కాలనీల నుంచి పలువురు చంటిపిల్లల తల్లులు హాజరై చిన్నారులకు టీకాలు వేయించారు. అదే విధంగా ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డుల నమోదుకు పెద్ద సంఖ్యలో కాలనీలవాసులు హాజరైనట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి తెలిపారు.



పిల్లలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ అభివృద్ధి కోసమే పార్టీ మారానని, ప్రస్తుతం డివిజన్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్‌కాలనీలో బుధవారం ఆమె సీసీ కెమెరాలు, సీసీ రోడ్డు ప్రారంభోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు మంజూరు చేసిన సీసీ కెమెరాలను నేడు ప్రారంభించడం జరిగిందన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నందున డివిజన్‌కు అధిక నిధులు మంజూరు చేయిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు విజయభాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్‌యాదవ్, ప్రవీణ్, రాహుల్‌సాగర్, విష్ణువర్ధన్, బద్రి, కృష్ణ, మంద శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఐలేష్‌గౌడ్, అల్వాల్‌గౌడ్, వెంకటేష్, దర్మారెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, సతీష్‌గౌడ్, నర్సింహా, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా వనస్థలిపురం శారదానగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం పూజలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.గూడూరు హరినాథ్ ఆవిష్కరించారు. గురువారం స్వామి వారికి పంచామృతాలతో మహాన్యాస పూర్వక మన్యుసూక్త సహిత ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష తమలపాకులతో అర్చన, మంగళహారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, సాయంత్రం ధార్మిక ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్, సుబ్బారావు, రాజశేఖర్‌శర్మ, రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న హరినాథ్

గంజ్ ప్రాంగణం.. చిత్తడిమయం

మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం కురిసిన వర్షానికి గంజ్ ప్రాంగణమంతా చిత్తడిగా మారింది. సాయంత్రం చినుకులతో మొదలైన వాన రాత్రి భారీగా కురవడంతోనీరు మార్కెట్ ప్రాంగణంలో వర్షం నీరు నిలిచింది. సరైన డ్రైనేజీ లైన్లు లేకపోవడంతో వర్షాకాలంలో మార్కెట్ ప్రాంగణంలో నీరు నిలవడం పరిపాటిగా మారిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – చాదర్‌ఘాట్



రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గణేష్

దిల్‌సుఖ్‌నగర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువ లేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీ రాజీవ్‌గాంధీ(టీఎస్ఆర్) చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారత యువ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించి యువత రాజకీయాల్లోకి వచ్చేలా స్ఫూర్తి నింపిన నేత రాజీవ్‌గాంధీ అన్నారు. 18 ఏళ్ల వారికి ఓటు హక్కు కల్పించడం, పంచాయతీ రాజ్ వ్యవస్థ, నవోదయ విద్యాలయాలు లాంటి అనేక పథకాలు ఆయన హయాంలోనే వచ్చాయని గుర్తు చేశారు. టెలికాం ఐటీ కమ్యూనికేషన్ రంగాల్లో భారత్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, మధుసూధన్ రావు, శేఖర్ ముదిరాజ్, రమేష్ నేత, వెంకటేష్ గుప్తా, సైదులు, మహేందర్, లింగ స్వామి గౌడ్, యాదవరెడ్డి, రాజు నాయక్, రేణుక, రామకృష్ణ గౌడ్, ప్రేమ్ నాయక్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ విగ్రహానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సీనియర్ నాయకుడు మొహమ్మద్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, రఫీక్ రజాక్ అలీ, జాంగిర్ బాబు, మియా పాల్గొన్నారు

నేటి యువతకు ఆదర్శం..

చంపాపేట: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నేటి యువతకు ఆదర్శమని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేఘావత్ గణేష్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై రాజీగాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్‌గుప్తా, దుర్గారెడ్డి, శివ, కిరణ్, వెంకటేష, జంగయ్య, రాము, తిరుపతి, జగన్, రమేష్, యాదమ్మ, అనిత పాల్గొన్నారు.



కొత్తపేట చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న లింగాల కిషోర్‌గౌడ్



ఆర్‌కేపురంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తపేట చౌరస్తాలో..

నాగోలు: నేటి యువతకు రాజీవ్‌గాంధీ ఆదర్శనీయమని కాంగ్రెస్ పార్టీ కొత్తపేట అధ్యక్షులు లింగాల కిషోర్‌గౌడ్ అన్నారు. కొత్తపేట చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కిషోర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శిధర్‌రెడ్డి, షరీఫ్, రానా, కృష్ణారెడ్డి, జహంగీర్ బాబాగౌడ్, సములేటి సాయి, లింగాల భాషా గౌడ్, రమణ, రాజేందర్ రెడ్డి, పిట్టల రవి, వాహీద్ పాల్గొన్నారు.